TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 32 | 25-6-2025 బుధవారం | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

# కేసీఆర్..దమ్ముంటే అసెంబ్లీకి రా

## తెలంగాణ ద్రోహులెవరో అక్కడే తేల్చుకుందాం

గోదావరి, కృష్ణా జలాలు, బనకచర్లపై చర్చ పెడదాం

3 వేల టీఎంసీలు వృథా పోతున్నాయని చెప్పిందెవరు?

రోజాకు రతనాల సీమ హామీ ఇచ్చిన చవట ఎవరు?

కృష్ణాలో 555 టీఎంసీల వాటా అడగకుండా

299 టీఎంసీలకు సంతకం పెట్టింది మీరు కాదా?

లక్ష కోట్లు దోచుకున్న నిన్ను ఉరి తీసినా తప్పులేదు

కేసీఆర్ సచ్చిన పాము.. బీఆర్ఎస్ చచ్చిన పార్టీ

గోదావరి సెంటిమెంటుతో మంటపెట్టే ప్రయత్నం

కేసీఆర్ శకుని.. మేనల్లుడు హరీశ్ శనీశ్వరుడు

సోనియాకు అండగా నిలవాలని బాబును వదులుకున్నా

రైతు భరోసా విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూన్ 24: కేసీఆర్‌కు ధైర్యం, నిజాయితీ చిత్తశుద్ధి ఉంటే గోదావరి జలాలపై శాసనసభలో చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాలు విసిరారు. "దమ్ముంటే స్పీకర్‌కు లేఖ రాయి... చెప్పిన తేదీ నాడు అసెంబ్లీ పెడతాం. గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసింది ఎవరు? ప్రాణహిత- చేవెళ్లను మార్చి రూ.లక్ష కోట్లు దోచుకున్నదెవరు?" అక్కడే తేల్చుకుందామన్నారు. "గోదావరిలో 3 వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయని, వాటిని రాయలసీమకు తరలించాలని 2016 చెప్పింది మీరు కాదా? మొత్తం వివరాలతో అసెంబ్లీకి వస్తా. మీరు అసెంబ్లీకి వచ్చి చర్చించటానికి సిద్ధంగా ఉన్నారా?" అని నిలదీశారు. కేసీఆర్ చెప్పిన తర్వాతే ఉమాభారతి ఆదేశాల మేరకు గోదావరి నుంచి బనకచర్లకు నీళ్లు తరలించటానికి, హంద్రీనీవాకు 400 టీఎంసీలు తరలించటానికి 2016లో చంద్రబాబు జీవో ఇచ్చారని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2018లో వ్యాప్కోసను నియమించింది నిజం కాదా? గోదావరి జలాలను బనకచర్లకు తరలించటానికి వ్యాప్కోస్ నివేదిక ఇచ్చింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. గోదావరి నీళ్లు 3 వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయని కేసీఆర్ ఇచ్చిన బోడి, ఉచిత, దిక్కుమాలిన సలహాతోనే ఈ రోజు ఈ దరిద్రం దాపురించిందని వ్యాఖ్యానించారు. రోజమ్మ పెట్టిన రాగి సంకటి, రొయ్యల పులుసు తిని రాయల సీమను రతనాల సీమగా చేస్తానని చెప్పిన చవటవు నీవు కాదా? అని కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిని చేసి ప్రజలు దీవిస్తే.. వందల టీఎంసీలు రాయలసీమకు తరలించమని చెప్పి రాష్ట్రాన్ని ఎడారిగా మార్చి ద్రోహం చేశారని మండిపడ్డారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం సచివాలయ ప్రాంగణంలో జరిగిన రైతు భరోసా విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ చీఫ్ మహేష‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,600 రైతు వేదికల్లో దీనిని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలు కేటాయిస్తే.. 512 టీఎంసీలు ఆంధ్రాకు తీసుకోవాలని, 299 టీఎంసీలు తెలంగాణకు సరిపోతాయని చంద్రబాబుకు వంగివంగి దండం పెట్టి చెప్పి సంతకం పెట్టింది నీవు కాదా? అని కేసీఆర్‌ను నిలదీశారు. పదేళ్లలో ఏ ఒక్కరోజూ 299 టీఎంసీలు పూర్తిగా వాడలేదన్నారు. 68% పరివాహక ప్రాంతం తెలంగాణలో ఉన్నందున 555 టీఎంసీలు తెలంగాణకు రావాలని, 299 టీఎంసీలకు సంతకం పెట్టి మరణ శాసనం రాసింది కేసీఆరేనని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నపుడే రాయలసీమలో చంద్రబాబు ముచ్చుమర్రి కట్టారని ప్రస్తావించారు. జగన్ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు జీవోలు ఇచ్చి, టెండర్లు పిలిచింది నిజం కాదా? పోతిరెడ్డిపాడు పొక్కను పెద్దది చేసి రోజుకు 10 టీఎంసీ లు తరలించటానికి సంతకాలు చేసింది నిజంకాదా? అని రేవంత్ నిలదీశారు. చేసిన తప్పులు కప్పి పుచ్చుకొని, మొఖం చెల్లక కేసీఆర్ ఫామ్‌హౌజ్‌ల పడుకొని మేనల్లుడిని ఊరిమీద వదిలేస్తే అచ్చోసిన ఆంబోతులా తనను తిడుతున్నారని అన్నారు. కాంగ్రె స్ ప్రభుత్వం వచ్చాకే సీతారామకు 65 టీఎంసీల నీటి కేటాయింపులు తీసుకొచ్చామని, సమక్క-సారలమ్మ కోసం మోదీతో కొట్లాడుతున్నామని చెప్పారు.

మిగతా 2లో...

# పదేళ్లు అధికారం కాంగ్రెస్‌దే



ఇప్పుడు పార్టీలో పనిచేసే వారికి వచ్చే టర్మ్‌లో ప్రభుత్వ పదవులు

పెరిగే సీట్లతో మరిన్ని అవకాశాలు.. 18 నెలల పాలన స్వర్ణయుగం

టీపీసీసీ నూతన కార్యవర్గానికి రేవంత్ దిశానిర్దేశం

2లో

# బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

జలాలు సముద్రంలోకి వెళ్లకుండా ఆపేందుకే ప్రాజెక్టు


కేసీఆర్, జగన్ సీఎంలుగా ఉన్నప్పుడే నిర్ణయం: బక్కని



షాబాద్, (సందేశం టైమ్స్)జూన్ 24: బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణకు ఎలాంటి నష్టం లేదని, రాజకీయ లబ్ధి కోసమే కొందరు నేతలు అభ్యంతరాలు చెబుతున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు.

మిగతా 2లో...

# ఏం సాధించారని రైతు సంబురాలు?: హరీశ్



హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూన్ 24: రైతు సంబురాలు ఎందుకు చేస్తున్నారని, ఏం సాధించారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.

మిగతా 2లో...

# కాంగ్రెస్ వచ్చాక లాభాల్లో ఆర్టీసీ



ఎల్లారెడ్డి,(సందేశం టైమ్స్)జూన్ 24: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

మిగతా 2లో...

# బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం

జూలై 17న చేపట్టే రైల్ రోకోకు మద్దతివ్వండి

సీపీఎం, న్యూడెమోక్రసీ నేతలను కలిసిన ఎమ్మెల్సీ కవిత



మిగతా 2లో...

# కేసీఆర్..దమ్ముంటే అసెంబ్లీకి రా

తుమ్మిడిహెట్టి ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్‌కు నీళ్లు తెచ్చి ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ప్రకటించారు. "తెలంగాణలో కేసీఆర్ సచ్చిన పాము. సచ్చిన పాము గోదావరి జలాల సెంటిమెంటుతో మంట పెడుతోంది. సచ్చిన పార్టీని బతికించుకోవటానికి సెంటిమెంటును అందుకున్నడు. ముందుగా హరీశ్‌రావును చూసి రమ్మని పంపిండు. తెలంగాణ రైతాంగం ఎడ్డోళు ‌కాదు.. గుడ్డోళ్లు కాదు" అని రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే సుప్రీంకోర్టులో తేల్చుకుంటామని ప్రకటించారు. కేసీఆర్ తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెడతామంటే ఇక్కడెవరూ ఊరుకునేటోడు లేడన్నారు. లక్ష కోట్లు కొల్లగొట్టి, వేల ఎకరాల భూములను ఆక్రమించి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన కేసీఆర్ ఇప్పుడు గోదావరి బనకచర్ల ద్వారా చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి నీళ్లిస్తున్నాడని దుర్మార్గపు ప్రచారం చేస్తున్నడని రేవంత్ మండిపడ్డారు. చంద్రబాబుతో అంటకాగాలనుకుంటే అక్కడే ఉండెటోణ్ణి కదా? రాహుల్‌గాంధీ ఆశీర్వాదం తీసుకుని ఇక్కడెందుకు ఉంటా? అని ప్రశ్నించారు.సోనియాగాంధీ కాళ్లకు దండం పెట్టి నట్టేట్లో ముంచి నడి బజార్లో మోసంచేసిన చరిత్ర కేసీఆర్‌దని, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు అండగా నిలబడాలని, చంద్రబాబును వదులుకొని కాంగ్రె స్‌లో చేరిన ఘనత తనదని రేవంత్ అన్నారు. కృష్ణానదిపై ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిన తెలంగాణ ప్రాజెక్టుల్లో ఏ ఒక్కటి కూడా గత పదేండ్లలో కేసీఆర్ పూర్తి చేయలేదన్నారు. లక్ష కోట్లతో కాళేశ్వరం కడితే అది మూడేళ్లలోనే కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను ఉరి తీసి నా తప్పులేదని రైతులు అంటున్నారని వ్యాఖ్యానించారు. వానాకాలం రైతు భరోసా కింద 70 లక్షల కుటుంబాలకు, కోటిన్నర ఎకరాలకు, 9 వేల కోట్లు 9 రోజుల్లో చెల్లింపులు చేసి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని చెప్పారు. దండగ అనే పరిస్థితి నుంచి వ్యవసాయాన్ని పండగగా మార్చిన ఘనత కాంగ్రెస్ దేనని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిపోతే తమ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లో రూ.7,625 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.20,617 కోట్ల రుణ మాఫీ చేశామని చెప్పారు. 2 కోట్ల 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసి రైతులు దేశంలో మొదటి స్థానంలో రాష్ట్రాన్ని నిలిపితే అంతే ఉత్సాహంగా చివరి గింజవరకు కొంటున్నామని, సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చామని తెలిపారు. శకుని మామ కేసీఆర్‌కు శనీశ్వరుడైన అల్లుడు హరీశ్‌రావు తోడై తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతు బంధు ఇవ్వాలంటే కోకాపేట భూములు అమ్మారని, రుణమాఫీ చేయాలంటే ఔటర్ రింగురోడ్డును తెగనమ్మారని, రైతులకు నీళ్లిస్తామని కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు కొల్లగొట్టారని రేవంత్ ఆరోపించారు. తెలంగాణ రాకముందు మీ ఆర్థిక పరిస్థితి ఏమిటి? మొయినాబాద్‌లో హరీశ్‌రావుకు, జన్వాడలో కేటీఆర్‌కు, గజ్వేల్ ఎర్రవల్లిలో కేసీఆర్‌కు ఫామ్‌హౌజులు ఎట్లొచ్చినయ్? టీవీలు, పేపర్లు, వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ఎట్లొచ్చినయ్ అని నిలదీశారు.

**వ్యవసాయం అంటేనే కాంగ్రెస్: భట్టి**

రైతుల గురించి ఈ దేశంలో కాంగ్రెస్ తప్ప మరే పార్టీ ఆలోచన చేయదని, రైతులను ప్రేమించలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం అని అన్నారు.

# బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..బనకచర్ల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి ఎటువంటి నష్టం చేసే ఉద్దేశం ఏపీ సీఎం చంద్రబాబుకి లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ కలిసి బనకచర్లపై హైదరాబాద్/ఢిల్లీ వేదికగా అఖిలపక్షం ఆధ్వర్యంలో చర్చిద్దామని సూచించారు. వర్షపు నీరు సముద్రంలోకి వృథాగా పోకుండా అడ్డుకునేందుకే మాజీ సీఎంలు కేసీఆర్, జగన్‌లు ఉన్నపుడు ప్రగతి భవన్‌లో బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని, ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ పెద్దన్న పాత్ర పోషించి ఆ నీటితో రాయలసీమకు నీరందించి రతనాల సీమగా మార్చుతానన్నారని చెప్పారు. కానీ, బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిల పైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మరొకరిపై నిందలు వేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో ప్రజల కోసం టీడీపీ నిరంతరం పనిచేస్తుంది కానీ స్వార్థ రాజకీయాల కోసం కాదన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ టీడీపీ బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఏం సాధించారని రైతు సంబురాలు?: హరీశ్

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను మోసం చేశారని మండిపడ్డారు. రైతు సంబురాలు అంటూ సచివాలయం ముందు సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి తన సంకుచిత మనస్తత్వాన్ని బయటపెటుకున్నారని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రత్యేక రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సంస్కారం లేని విధంగా మాట్లాడి తన చిల్లర బుద్ధిని విమర్శించారు. తెలంగాణకు శనిలా శాపంలా మారిన రేవంత్‌రెడ్డి ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే అనే రీతిలో పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించిన ప్రగతిని తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారని ధ్వజమెత్తారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుపై భరోసా లేక విధిలేని పరిస్థితుల్లో రైతు భరోసా నిధులు ఇచ్చి.. తానే రైతులకు ఛాంపియన్ అని రేవంత్ రెడ్డి దర్పాన్ని ప్రదర్శిస్తే నమ్మేవారెవరు లేరని ఆయన అన్నారు.

# పదేళ్లు అధికారం కాంగ్రెస్‌దే

హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూన్ 24: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 2033 వరకూ అధికారంలో ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం పార్టీ పదవుల్లో పని చేస్తున్న వారికి 2029లో ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పకుండా అవకాశాలు వస్తాయని చెప్పారు. పార్టీ కోసం పని చేసేవారిని రానున్న పదేళ్లూ కాపాడుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని ప్రకటించారు. గడిచిన 18 నెలల కాంగ్రెస్ పాలనను ముఖ్యమంత్రి స్వర్ణయుగంగా(గోల్డెన్ పిరియడ్) అభివర్ణించారు. ఈ 18 నెలల పాలనలో ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపైన చర్చకు సవాల్ విసరాలంటూ సూచన చేశారు. టీపీసీసీ నూతన కార్యవర్గం మంగళవారం గాంధీభవన్‌లో భేటీ అయింది. టీపీసీసీ చీఫ్ మహేషగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, కార్యవర్గ సభ్యులు, డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ,కాంగ్రెస్‌లో కార్యకర్త స్థాయి నుంచి అనేక మంది ముఖ్యమంత్రులు, మంత్రులు, పీసీసీ చీఫ్‌ల స్థాయికి ఎదిగారని ప్రస్తావించారు.

కాంగ్రెస్ పార్టీలో బాధ్యతలు నిర్వర్తించిన వారికి పదవులు వచ్చి తీరుతాయని చెప్పారు. టీపీసీసీలో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా 2018లో బాధ్యతలు తీసుకున్న తాను.. ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా, తెలంగాణ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా ఎదిగానంటే అది పార్టీలో తాను నిర్వహించిన బాధ్యతలకు ప్రతిఫలమేనన్నారు. తాను పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు.. కొంతమంది పార్టీ నేతలు వివిధ అనుబంధ సంస్థల బాధ్యతలు స్వీకరించడానికి ఇష్టపడలేదని రేవంత్ గుర్తు చేసుకున్నారు. అప్పుడు ముందుకు వచ్చి బాధ్యతలు తీసుకున్న వారిలో 65 మందికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు.. తదితర పదవుల్లో అవకాశాలు ఇచ్చామని ప్రస్తావించారు. కొత్తగా ఎంపికైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులు పార్టీ నిర్మాణంలో బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మండల, జిల్లా కమిటీల ఏర్పాటులో, సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లడంలో భాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. "పదవులతో ఇక రాజకీయ జీవితం నల్లేరుపై నడకని ఎవరూ అనుకోవద్దు. మీ నియామకం మూడేళ్లకు.. ప్రభుత్వం ఇంకా ఉండేది నాలుగేళ్లు. సరిగా పని చేయని వారిని ఎన్నికల ముందు ఆయా పదవుల నుంచి పీసీసీ అధ్యక్షుడు తప్పిస్తారని సంపూర్ణంగా విశ్వసిస్తున్న" అన్నారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకున్న వారే రేపు నాయకులుగా ఎదుగుతారని రేవంత్ ఉద్బోధించారు. అప్పుడే పార్టీ బలోపేతమై రెండోసారి అధికారంలోకి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు టీడీపీ అధికారంలో ఉంటే.. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. 2014 నుంచి 2023 వరకూ బీఆర్ఎస్ అధికారంలో ఉందన్నారు.

# ఒలింపిక్ స్వర్ణానికి రూ 6 కోట్లు



హైదరాబాద్ (సందేశం టైమ్స్)జూన్ 24: తెలంగాణ ప్రభుత్వ కొత్త క్రీడా పాలసీలో నగదు ప్రోత్సాహకాలను భారీగా పెంచారు. గతంలో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధిస్తే ఇచ్చే రూ.2 కోట్లను తాజా పాలసీలో రూ.6 కోట్లకు, ఆసియా క్రీడల్లో పసిడి పతకం గెలిస్తే ఇచ్చే రూ.30 లక్షలను రూ.3 కోట్లకు గణనీయంగా పెంచారు. ఇకపై ఒలింపిక్స్‌లో రజతానికి రూ.4 కోట్లు, కాంస్యానికి రూ.2 కోట్లు, ఆసియా క్రీడల్లో రజతానికి రూ. కోటిన్నర, కాంస్యానికి రూ.75 లక్షలు ఇవ్వనున్నారు. కామన్వెల్త్ క్రీడలకు గతంలో స్వర్ణానికి రూ.25 లక్షలు ఉండగా, తాజాగా రూ. కోటిన్నరకు పెంచారు. రజతానికి రూ.75 లక్షలు, కాంస్యానికి రూ.50 లక్షలు అందిస్తారు. సాధారణ క్రీడాకారులతో సమానంగా ఎలాంటి వ్యత్యాసం లేకుండా పారా అథ్లెట్లకు కూడా ఇవే నగదు బహుమతులను అందించనున్నామని శాట్ చైర్మన్ శివసేనారెడ్డి చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్న క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఆర్థిక, శిక్షణ పరంగా సహాయం అందించేందుకు కాంపిటేటివ్ అండ్ హైపెర్ఫామెన్స్ స్పోర్ట్స్ బోర్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం

చిక్కడపల్లి/రాంనగర్, (సందేశం టైమ్స్)జూన్ 24: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం జూలై 17న నిర్వహించే రైల్ రోకో కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కోరారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని, విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో న్యూడెమోక్రసీ నేతలు సాధినేని వెంకటేశ్వరరావు, జె.వి.చలపతిరావు, కె.గోవర్ధన్‌లను ఆమె కలిశారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ.. కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు రెండేళ్లుగా ఉద్యమిస్తున్నామన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ఆమోదించాలంటూ కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవడం లేదని విమర్శించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలంటే ఉద్యమబాటనే మార్గం అని పేర్కొన్నారు. తమ ఉద్యమానికి మద్దతివ్వాలంటూ భావసారూప్యత కలిగిన శక్తులన్నింటినీ కలుస్తున్నామని వెల్లడించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఉద్యమానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. న్యూడెమోక్రసీ నాయకులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పై కవిత చేస్తున్న ఉద్యమాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

# కాంగ్రెస్ వచ్చాక లాభాల్లో ఆర్టీసీ

మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో ఎస్‌డీఎఫ్ నిధులు 4.5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ నష్టాల్లో కూరుకుపోందని, పదేళ్ల కాలంలో సంస్థలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తాను రవాణా శాఖ మంత్రిగా నియామకమయ్యాక రాష్ట్రవ్యాప్తంగా కేవలం 48 గంటలలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళి బోనాల ఏర్పాట్లపై మంత్రి పొన్నం సమీక్ష



(సందేశం టైమ్స్)జూన్ 24: తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రాచీనమైన, భక్తిశ్రద్ధలతో నిండిన ఉత్సవాలలో బోనాల జాతరకు విశిష్ట స్థానం ఉంది. ముఖ్యంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతరకి ప్రత్యేక పౌరాణిక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది. ప్రతి సంవత్సరం వేలాదిగా భక్తులు ఈ జాతరలో పాల్గొంటారు. వచ్చే జూలై 13, 14 తేదీల్లో జరగనున్న ఈ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

# ఏసీబీ వలలో పంచాయతీ సెక్రెటరీ..



దస్తూరాబాద్, (సందేశం టైమ్స్)జూన్ 24:నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం గోడిసిర్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ రూ.12 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కారు. తన ఇంటి పక్క షెడ్డులో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అనుమతి కోరుతూ గ్రామ పంచాయతీకి అదే గ్రామానికి చెందిన ఓ రైతు దరఖాస్తు చేసుకున్నాడు.వాటర్ ప్లాంట్ అనుమతి కోసం కొన్ని నెలలుగా పంచాయతీ సెక్రెటరీ చుట్టూ తిరిగినా అనుమతి లభించలేదు. రూ.15వేలు లంచం ఇస్తేనే పనిచేసి పెడతానని సెక్రటరీ శివకృష్ణ తెగేసి చెప్పడంతో బాధితుడు పథకం ప్రకారం ఏసీబీని ఆశ్రయించారు. ఒప్పందం మేరకు రూ.12 వేలు ముందుగా లంచం తీసుకుంటుండగా మంగళవారం ఏసీబీ డీఎస్పీ మధు వలపన్ని పట్టుకున్నారు. చేతికి గులాబి రంగు పూసిన రూ.500 నోట్లను కార్యదర్శి శివకృష్ణకు ఇస్తుండగా పట్టుబడ్డారు. నిర్మల్ జిల్లాలో వరుసగా ఏసీబీ దాడులు అధికార యంత్రాంగంలో అలజడి రేపుతున్నాయి.

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

## ధర్నా చేస్తున్న మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు
## రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్మికుల నిరసన



రాజమహేంద్రవరం (సందేశం టైమ్స్)జూన్ 24: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 45రోజులగా నిరసన దీక్షలు చేస్తున్న మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. కార్మికులు వారి కుంటుంబాల తో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కార్మికుడి భార్య ఎస్.సుధారాణి మాట్లాడుతూ తన భర్తకు నెలకు రూ.15 వేలు జీతమని, రూ.2 వేలు కటింగ్‌లు పోను రూ.13 వేలు చేతికి ఇస్తున్నారని, ఈ మొత్తాన్ని ఇంటి అద్దె, కరెంట్ బిల్లు, నిత్యావసరాలు, పిల్లల చదువులకు సర్దలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే ప్రభుత్వం ఉద్యోగమే అయినా జీతం అరకొరేనని అన్నారు. ఉద్యోగి వై.సత్తిరాజు మాట్లాడుతూ దివ్యాంగుడైన తన కుమారుడికి 2014-19లో నాటి సీ ఎం చంద్రబాబు దివ్యాంగ పెన్షన్ ఇచ్చే వారని 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక దానిని తొలగించారన్నారు. ఇటు జీతాలు పెం చక అటు పింఛన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్మికుల పిల్లలు పవన్, చం ద్రశేఖర్ మాట్లాడుతూ తమ తండ్రులు ప్రభుత్వ ఉద్యోగులనే కారణంతో చదువుకుంటున్న తమకు తల్లికి వందనం సొమ్ములు పడలేదన్నా రు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు అందడం లేదన్నారు. నిరసనలో కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమాదుల ఏసు బాబు, బుంగ యేషయారాజు, కోటాని ముకుం దరామ్, సిరికి ప్రసాద్, పాలిక బాల భవానీకు మార్, మందనక్క సాయి, బొక్కా శ్రీను, వెదురుపర్తి ఏసు, బండారు గణేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో
# జూలై 12 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



అమరావతి,(సందేశం టైమ్స్)జూన్ 24:: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడం లక్ష్యంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాలిచ్చారు. విద్యార్థుల సంఖ్య పెంచడంతోపాటు బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించాలన్నారు. ఇందుకోసం ఇంటింటి సర్వే చేపట్టాలని, జూలై 12 వరకు డ్రైవ్ కొనసాగాలని ఆదేశించారు. వంద శాతం బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండటం, 6-14 ఏళ్ల పిల్లలను కచ్చితంగా బడుల్లో చేర్చడం ఈ డ్రైవ్ లక్ష్యాలుగా పేర్కొన్నారు. డ్రైవ్‌లో భాగంగా అన్ని పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

# యాజమాన్యాల తప్పులకు విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టొద్దు

## ఫలితాలు వెల్లడించాల్సిందే.. ఏఎన్‌యూ రిజిస్ట్రార్‌కు హైకోర్టు స్పష్టం



అమరావతి,(సందేశం టైమ్స్)జూన్ 24: డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు చేసిన తప్పులకు విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టడానికి వీల్లేదని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) రిజిస్ట్రార్‌కు హైకోర్టు తేల్చిచెప్పింది. అఫిలియేషన్, ఇతర ఫీజులు చెల్లించని కాలేజీ యాజమాన్యాలపై ఎలాంటి కఠినచర్యలు తీసుకున్నా తమకు అభ్యంతరం లేదంది. విద్యార్థుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, 2022-25 బ్యాచ్ 6వ సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను వెల్లడించాల్సిందేనని తేల్చిచెప్పింది. కాలేజీ యాజమాన్యాల నుంచి సొమ్మును రాబట్టుకొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలంది. రిజిస్ట్రార్‌తో మాట్లాడి సమస్యకు తగిన పరిష్కారం కనుగొనాలని ఏజీకి సూచిస్తూ విచారణను ఈనెల 26కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి విచారణకు హాజరు నుంచిరిజిస్ట్రార్‌కు మినహాయింపు ఇచ్చారు. తమ కాలేజీల 2022-25 బ్యాచ్ 6వ సెమిస్టర్ విద్యార్థుల పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెల్లడించకపోవడాన్ని సవాల్ చేస్తూ గుంటూరు జిల్లాకు చెందిన మహాత్మా గాంధీ కాలేజీ, ప్రకాశం జిల్లాకు చెందిన కార్తికేయ డిగ్రీ కాలేజీ, మరికొన్ని ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు వేసిన వ్యాజ్యాలు సోమవారం విచారణకు వచ్చాయి. దీనిపై వివరణ ఇచ్చేందుకు వర్సిటీ రిజిస్ట్రార్ కోర్టు ముందు హాజరయ్యారు. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ఈ యాజమాన్యాలు అఫిలియేషన్ ఫీజు చెల్లిస్తే వెంటనే విద్యార్థుల ఫలితాలు వెల్లడిస్తామన్నారు. కాలేజీ యాజమాన్యాల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించారని, ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్, ఇతర సొమ్ము అందకపోవడంతో అఫిలియేషన్ ఫీజు చెల్లించలేకపోయామన్నారు. ఏజీ స్పందిస్తూ.. పూర్తి వివరాలతో కౌంటర్‌వేస్తామని చెప్పగా న్యాయమూర్తి అంగీకరించారు.

# మీసేవ లో ఈ-స్టాంపుల కుంభకోణం



- కళ్యాణదుర్గం వేదికగా నకిలీ స్టాంపుల విక్రయం
- రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకూ స్కాం?
- మీసేవ నిర్వాహకుడు ఎర్రప్ప సూత్రధారి
- రూ.100 విలువైన స్టాంపులు రూ.లక్షకు విక్రయం
- ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా కంపెనీ ఆడిట్‌తో వెలుగులోకి..

అనంతపురం(సందేశం టైమ్స్)జూన్ 24: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. మీ సేవ కేంద్రం నిర్వాహకుడు పలు కంపెనీలకు నకిలీ స్టాంపులు విక్రయించి, రూ.కోట్లు కొల్లగొట్టినట్లు సమాచారం. ఈ ఘటనపై ప్రముఖ నిర్మాణ సంస్థ ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు అనంతపురం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన బోయ ఎర్రప్ప అలియాస్ మీ సేవ బాబు తన భార్య కట్ట భార్గవి పేరిట తహసీల్దారు కార్యాలయం వద్ద మీ సేవ కేంద్రం నడుపుతున్నాడు. ఇక్కడే ఈ-స్టాంపులను విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో నకిలీ స్టాంప్‌లు సృష్టించి, విక్రయించడం మొదలు పెట్టారు. రూ.100 విలువ గల స్టాంపులను సైతం రూ.లక్ష విలువైనవిగా చూపించి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి నకిలీ స్టాంపులను భారీగా విక్రయించారు. ఆ సంస్థ అంతర్గత ఆడిట్‌లో ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు ఇచ్చిన నకిలీ స్టాంపులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ పోలీసులు నిందితులు ఎర్రప్ప, ఆయన భార్య భార్గవి, మరో వ్యక్తిని రాత్రే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మొత్తంగా రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకూ స్కాం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా ప్రతినిధి గుంటూరు సతీషబాబు సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# ముఖ హాజరు వేయాల్సిందే!

- బాలసంజీవిని యాప్‌లో నమోదుకు లబ్ధిదారు ఫొటో తీస్తున్న అంగన్‌వాడీ టీచర్
- జూలై 1 నుంచి ముఖ ఆ?ధారితంగా లబ్ధిదారులకు పౌష్టికాహారం
- కేంద్ర మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ
- సిద్ధమవుతున్న ఐసీడీఎస్ అధికారులు



(సందేశం టైమ్స్)జూన్ 24: దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ సేవల్లో సమూల మార్పులకు కేంద్ర శిశు, సంక్షేమ మంత్రిత్వశాఖ శ్రీకారం చుట్టింది. జూలై 1వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ ఆధారిత గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్)ను ఆచరణలోకి తీసుకురానుంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేసే పౌష్టికా హారం పక్కదారి పట్టకుండా పారదర్శకతకు పెద్దపీట వేసేలా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేసేటప్పుడు, ఆహార పంపిణీ సమయంలో ముఖ గుర్తింపు తప్పనిసరి కానుంది. పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా అమలు చేయనున్నారు. జిల్లాలో పది సీడీపీవో ప్రాజెక్టుల కార్యాలయాల పరిధిలో 2,225 కేంద్రాల్లో మొత్తం 1,24,078 మంది అంగన్‌వాడీ సేవలను పొందుతున్నారు. గర్భిణులు 7,669 మంది, బాలిం తలు 10,315 మంది, ఆర్నెళ్లలోపు చిన్నారులు 8,989 మంది, 7 నెలలు నుంచి 36 నెలల వయస్సు కలిగిన చిన్నారులు 48,810 మంది, 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులు 48,295 మంది సేవలు పొందుతున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో నూతన విధానం అమలుకు కసరత్తు చే స్తున్నారు. ఇప్పటికే కేంద్రాలకు పంపిణీ చేసే కోడిగుడ్లపైనే వారానికి ఒక ముద్రతో సరఫరా చేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్ల, ఆయాలకు వేతనాలు పెంపుదలతో వారిలో జవాబుదారీ తనం పెంచడానికి ఈ విధానం దోహదం చేయనుంది. ఇప్పటి వరకు ఆ రెండు యాప్‌ల్లోనే.. ప్రస్తుతం బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, మూడు ఏళ్లలోపు చిన్నారుల ముఖ గుర్తింపు నమోదు చేస్తున్నారు. తొలుత కేంద్ర పర్యవేక్షణ లోని పోషణ్ ట్రాకర్ యాప్‌లోనే దాన్ని నమోదు చేసి, బాలసంజీవిని యాప్‌లో ఫొటోతో సహా నమోదవుతుం డ డంతో క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులుండవని భావిం చినా సర్వర్లు మొరాయించడంతో పాత విధానంలో చేయా ల్సిన రావడంతో ఇప్పుడు తాజాగా ఫేస్ ఫేస్ రికగ్నిషన్ విధానంకు నాంది పలికారు. దీంతో సరుకుల పంపిణీ అస లైన లబ్ధిదారులకు చేరతాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నా రులకు పోషకాహారం పంపిణీ ఏ మేర జరుగుతుందో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల నుంచి పర్యవేక్షించడం సులభం కానుంది. కొన్ని కేంద్రాల్లో ఇప్పటికే ప్రయోగాత్మకంగా నమోదు ప్రక్రియ ప్రారంభించగా విజయవంతమైనట్టు అధికా రులు చెబుతున్నారు. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు కేంద్రాల్లో మధ్యాహ్నం భోజనం వండించే సమయంలో ఫొటో తీసి ఆ వివరాలను పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేయనున్నారు.

# ఆరు కుటుంబాల సాంఘిక బహిష్కరణ




హరిపురం, (సందేశం టైమ్స్)జూన్ 24: సామాజిక వర్గ సమావేశానికి హాజరు కాలేదంటూ ఆరు కుటుంబాలను వెలి వేసిన ఘటన శ్రీకాకుళం జిల్లా మందస మండలంలో జరిగింది. మందస మండలం మఖరజోల పంచాయతీ అల్లిమెరక కాలనీలో ఉప్పర సామాజిక వర్గానికి చెందిన సుమారు 65 కుటుంబాలు ఏటా జూన్ 19న సమావేశం ఏర్పాటు చేసుకుని, పలు అంశాలపై మాట్లాడుకుంటాయి. ఈ ఏడాది సమావేశానికి నక్క రామారావు, గజ్జెల వల్లభరావు, నక్క బాలకృష్ణ, నక్క డిల్లేశ్వరరావు, నక్క సింహాచలం, నక్క లోకేశ్వరరావు హాజరుకాలేదు. దీంతో ఈ ఆరు కుటుంబాలను వెలివేస్తూ.. కులపెద్దలు తీర్పునిచ్చారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సన్నద్ధమవుతున్నారు.

# గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

పాలకొండ, (సందేశం టైమ్స్)జూన్ 24: మండలంలోని తుమరాడ గ్రామా నికి చెందిన రాకోటి అప్పలస్వామి(65) సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు అప్పల స్వామిని పాలకొండ ఏరియా ఆనుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విష మంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యం లోనే అప్పలస్వామి మృతి చెందాడు. పోలీసులు అప్పలస్వామి మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి



పార్వతీపురం,(సందేశం టైమ్స్)జూన్ 24: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక డీసీసీబీ కార్యాల యం వద్ద పీఏసీఎస్ సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సత్యం, బి.రాము నాయుడులు మాట్లాడుతూ జిల్లాలోని 34 పీఏసీఎస్‌లో విధులు నిర్వహి స్తున్న 102 మంది సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వేతన సవరణలు పూర్తి చేసి తమకు కొత్తజీతాలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జ్వరాల విజృంభణ



చిన్నపిల్లల వార్డులో ఒకే మంచంపై ఇద్దరికి సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం

సీతంపేట (సందేశం టైమ్స్)జూన్ 24: సీతంపేట ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తోన్నాయి. మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. రోజురోజుకూ జ్వర పీడితులు పెరుగుతున్నారు. ప్రధానంగా చిన్నారులను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. స్థానిక ఏరియా ఆసుపత్రికి ఓపీ 323 రాగా, వీటిలో వైరల్ జ్వరాలు 62, మలేరియా పాజిటివ్ కేసులు 20వరకు ఉన్నాయి. మిగిలిన వారు ఇతర ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో సేవలు పొందారు. ఇన్‌పేషెంట్లుగా 32 మంది ఏరియా ఆసుపత్రిలో చేరారు. కాగా, సీతంపేట ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు వసతి సమస్య వెంటాడుతోంది. ఆసుపత్రి పైఅంతస్థులో చిన్నారుల కోసం 20 బెడ్లతో ఓ వార్డును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అవి చాలడం లేదు. దీంతో చేసేది లేక ఒకే మంచంపై ఇద్దరేసి చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు. చిన్నపిల్లల వార్డులో 25మంది వరకు వైద్యం పొందుతున్నారు. వీరిలో 15 మంది మలేరియా, 10మంది వైరల్ జ్వరాల పీడితులు ఉన్నారు. జ్వరాలతో బాధపడుతున్న చిన్నారులకు వైద్యం అందించేందుకు ఆసుపత్రి పాతభవనం పైన మరో వార్డు ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ పనులు పూర్తయ్యాయి. మరో రెండు రోజుల్లో వార్డు సిద్ధం చేస్తాం. చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా వైద్యం అందిస్తాం.

# వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సక్రమంగా ఇవ్వాలి



ప్రొద్దుటూరు(సందేశం టైమ్స్)జూన్ 24: మండలంలోని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరీస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్‌హుస్సేన్ కోరారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు గంగయ్యకు ఆమేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. కొందరు డీలర్లు దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్లవద్ద సక్రమంగా రేషన్ సరుకులను పంపిణీ చేయడంలేదని తెలిపారు. ప్రతినెలా ఇళ్ల వద్దనే సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# సమస్యలు పరిష్కరించాలని సర్వేయర్ల నిరసన

నరసన్నపేట/ పలాసరూరల్/ జలుమూరు/ పాతపట్నం/(సందేశం టైమ్స్)జూన్ 24::గ్రామ సర్వేయర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసన్నపేట, పలాస, జలుమూరు, పాతపట్నం, నందిగాం మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. నిబంధనల మేరకు పదోన్నతులు కల్పించాలని, సీనియార్టీ జాబితా విడుదల చేయాలన్నారు. సొంత మండలాలకు బదిలీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలను అందించారు. కార్యక్రమాల్లో గ్రామ సర్వేయర్లు శరత్, రామచంద్రరావు, కె.ఉదయ్‌కిరణ్, అనిల్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 95 శాతం ట్రిపుల్‌ఐటీ సీట్లు 'ప్రభుత్వ' విద్యార్థులకే



- ప్రైవేటు బడుల్లో చదివిన వారికి 5 శాతం
- 4,240 మందికి ఆర్జీయూకేటీ సీట్లు కేటాయింపు
- ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 200 సీట్లు
- మొత్తం విద్యార్థుల్లో 69 శాతం అమ్మాయిలే
- ఈనెల 30 నుంచి జూలై 5 వరకు కౌన్సెలింగ్

అమరావతి/వేంపల్లె,(సందేశం టైమ్స్)జూన్ 24: రాష్ట్ర ట్రిపుల్ ఐటీలుగా భావించే ఆర్జీయూకేటీల్లో అడ్మిషన్లకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ఉన్నత విద్యామండలి ప్రకటించింది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ ఈ లిస్టును 'ఎక్స్' ద్వారా విడుదల చేశారు. ట్రిపుల్ ఐటీల్లో మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉండగా.. ప్రత్యేక క్యాటగిరి సీట్లు మినహాయించి 4,040 మంది రాష్ట్ర విద్యార్థులను, 200 మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో 94.78 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, 5.22 శాతం మంది ప్రైవేటులో చదివిన వారు ఉన్నారు. 69.01 శాతం అమ్మాయిలు, 30.99 శాతం అబ్బాయిలు ఎంపికయ్యారు. 2025-26 విద్యాసంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సు కోసం ఆర్జీయూకేటీలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళంలో క్యాంపసలకు 50,541 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 27,713 మంది, ప్రైవేటులో చదివిన వారు 19,670 మంది, ఇతర రాష్ట్రాల వారు 3,158 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులు కేటాయించి మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన జాబితాను తయారు చేసి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.ఎంపికైన విద్యార్థులు ఆర్జీయూకేటీ వెబ్‌సైట్ లేదా మనమిత్ర వాట్సాప్ నంబరు ద్వారా కాల్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ చాన్సలర్ కె.మధుమూర్తి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 30 నుంచి జూలై 5వరకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. జూలై 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. నాలుగు క్యాంప్‌సలకు వేర్వేరుగా కౌన్సెలింగ్ తేదీలను నిర్ణయించారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాకు 8.69 శాతం, ప్రకాశంకు 7.3 శాతం, నెల్లూరుకు 6.53 శాతం, అనకాపల్లికి 6.34 శాతం సీట్లు దక్కాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాకు అత్యల్పంగా 7 సీట్లు (0.17 శాతం) మాత్రమే వచ్చాయి.

# మోడల్ స్కూల్‌లో అనూహ్యంగా ప్రవేశాలు

- పింద్రంగి పాఠశాలలో గత ఏడాది 32 మంది విద్యార్థులు
- ఈ ఏడాది కొత్తగా 35 మంది చేరిక
- వీరిలో 23 మంది ప్రైవేటు స్కూళ్ల నుంచి రాక
- 62కు చేరిన విద్యార్థుల సంఖ్య



(సందేశం టైమ్స్)జూన్ 24: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో చదివిన పలువురు విద్యార్థులు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ఇందుకు కె.కోటపాడు మండలంలోని పింద్రంగి మోడల్ ప్రాథమిక పాఠశాల ఒక ఉదాహరణ. గత ఏడాది ప్రాథమిక పాఠశాలగా ఉన్న ఈ స్కూల్లో 32 మంది విద్యార్థులు వుండగా, ఈ ఏడాది ఇంతవరకు 62 మంది విద్యార్థులు వున్నారు. మొత్తం మీద కొత్తగా 35 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ఎంఈఓ-1 కె.సత్యనారాయణ, ఎంఈఓ -2 డీవీడీ ప్రసాద్ పాఠశాలలో మీడియాతో మాట్లాడుతూ, పింద్రంగి ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది ఒకటో తరగతిలో 14 మంది, రెండో తరగతిలో 8, మూడో తరగతిలో 5, నాలుగో తరగతిలో ఐదుగురితో కలిపి మొత్తం 32 మంది విద్యార్థులు వున్నట్టు చెప్పారు. గత ఏడాది ఐదో తరగతిలో ఒక్కరు కూడా లేరని తెలిపారు. నాలుగు నుంచి ఐదో తరగతికి వచ్చిన ఐదుగురు విద్యార్థులు ఈ ఏడాది రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేరారని, మొత్తం మీద గత ఏడాది చదివిన వారిలో 27 మంది ఈ ఏడాది కూడా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఇక కొత్తగా ఒకటో తరగతిలో 16 మంది,. రెండో తరగతిలో ఆరుగురు, మూడో తరగతిలో ఆరుగురు, నాలుగో తరగతిలో ఏడుగురు చేరినట్టు చెప్పారు. ఒకటో తరగతిలో చేరిన వారిలో 12 మంది అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వచ్చారని, మిగిలిన వారంతా ప్రైవేటు స్కూళ్ల నుంచి వచ్చి చేరారని వారు పేర్కొన్నారు. పాత విద్యార్థులు 27 మంది, కొత్త విద్యార్థులు 35 మంది కలిపి ప్రస్తుతం మొత్తం 62 మంది విద్యార్థులు వున్నారని, వీరికి పాఠాలు బోధించడానికి హెచ్‌ఎంతో కలిపి నలుగురు టీచర్లు వున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు గ్రామంలో చదువుకునే పిల్లలు వున్న ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, వసతులు, ప్రభుత్వ పథకాల వివరించి తల్లిదండ్రులకు వివరించడంతో సానుకూల స్పందన వచ్చిందన్నారు. ఉపాధ్యాయుల కృషితోపాటు సర్పంచ్ జె.రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఎన్.గోపి, ఎస్ఎంసీ చైర్మన్ బాదిరెడ్డి దేవి, గ్రామస్థుల సహకారంతో మోడల్ స్కూల్‌లో అనూహ్యంగా ప్రవేశాలు పెరిగాయని ఎంఈవోలు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాఠశాలను సందర్శించి హెచ్ఎం బి.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు కె.బంగారునాయుడు, పోతల నాయుడుబాబు, పి.రమేశ్‌తోపాటు ఎస్ఎంసీ చైర్మన్‌ను అభినందించారు.

# లంకెలపాలెం కూడలిలో లారీ బీభత్సం



తెలంగాణ (సందేశం టైమ్స్)జూన్ 24 నగర పరిధిలోని లంకెలపాలెం కూడలిలో రాత్రి జాతీయ రహదారిపై ఒక లారీ బీభత్సం సృష్టించింది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న కారుపైనుంచి అతి వేగంగా దూసుకువెళ్లి...పరవాడ నుంచి లంకెలపాలెం కూడలికి వచ్చి ఆగి ఉన్న మరొక కంటైనర్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, దాదాపు పది మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా రేబాకకు చెందిన పచ్చికోరు గాంధీతో పాటు మరో ఇద్దరు కారులో కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న తమ మిత్రుడిని పరామర్శించి వెనుతిరిగారు. రాత్రి సుమారు 10.15 గంటల సమయంలో లంకెలపాలెం కూడలి వద్దకు వచ్చేసరికి సిగ్నల్ పడడంతో వాహనాన్ని ఆపారు. అదేమార్గంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఆగి ఉన్న కారును బలంగా ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా కారును ఈడ్చుకుంటూ పరవాడ నుంచి లంకెలపాలెం వైపు వస్తున్న ఒక కంటైనర్ లారీని ఢీకొంది. ఈ క్రమంలో కారులో ఉన్న గాంధీ (54)తో పాటు అనకాపల్లి కొణతాల వీధికి చెందిన కొణతాల అచ్చెన్నాయుడు (55) చనిపోయారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006